క్లుప్తంగా

నేడు ప్రజాప్రతినిధులకు శిక్షణ

కురిచేడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో గురువారం మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఒక్కరోజు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. మండలంలోని ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పంచాయతీ సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు ప్రజాప్రణాళిక ఉద్యమం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక, సమగ్ర కార్యాచరణ ప్రణాళిక తయారు చేసేందుకు మార్గదర్శకాలు సూచిస్తూ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు మండలంలోని బోదనంపాడు, నమశ్శివాయపురం, ఆవులమంద, పెద్దవరం, బయ్యవరం, దేకనకొండ, వెస్ట్ నాయుడుపాలెం, మధ్యాహ్నం 2 గంటలకు కల్లూరు, పడమరకాశీపురం, పడమర గంగవరం, పడమరవీరాయపాలెం, అలవలపాడు, పొట్లపాడు, గంగదొనకొండ గ్రామ పంచాయతీలకు సంబంధించిన వారికి శిక్షణ ఉంటుందని ఆమె వివరించారు.

బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఒంటేరు

పెద్దదోర్నాల: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలానికి చెందిన ఒంటేరు నాగేశ్వర యాదవ్ నియమితులయ్యారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావ్ యాదవ్ జారీ చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో యర్రగొండపాలెం మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడిగా ఆయన పని చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎంపికైన సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతికి వరం పచ్చని చెట్లు


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

దొనకొండ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్రకృతికి వరం పచ్చని చెట్లని శ్రీగౌతమి కళాశాల అడ్మిన్ నాని తెలిపారు. నెహ్రూ జయంతి సందర్భంగా బుధవారం కళాశాల ఆవరణలో విద్యార్థులు పూల మొక్కలు నాటారు. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడానికి చెట్లు ఎంతో ఉపయోగ పడతాయని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నాని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామయోగి, అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

దర్శి: మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని డీవీ జ్యోతి డిస్కస్ త్రోలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 6, 7 తేదీల్లో ఏలూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ 68వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ అండర్ -14 విభాగంలో ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర స్థాయిలో రెండోస్థానం కైవసం చేసుకుంది. విద్యార్థిని ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌కిరణ్ కుమారి, పీడీ మాలకొండయ్య అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి రైతు బజార్

- రూ.1.28 కోట్లతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ప్రారంభించిన అప్పటి రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్


రైతు బజార్‌ను ప్రారంభిస్తున్న అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ (ఫైల్)

యర్రగొండపాలెం: రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్ముకునే సౌలభ్యం కల్పించేందుకు స్థానిక పుల్లలచెరువు రోడ్డులో రూ.1.28 కోట్లతో నిర్మించిన రైతు బజార్ త్వరలో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పండ్లు, కూరగాయలు పండించే రైతులు తమ సరుకును నిల్వ ఉంచుకునేందుకు 46 స్టాల్స్ ఉచితంగా, వినియోగదారుల సౌకర్యార్థం క్యాంటీన్, కిరాణా దుకాణాలు నిర్వహించేందుకు అద్దె ప్రాతిపదికపై మరో 5 షాపులు కేటాయించినట్లు సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఇటీవల ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు స్టాల్స్ ఉచితంగా పొందేందుకు స్వయం సహాయక సంఘాలు, అద్దె ప్రాతిపదికపై స్టాల్స్ నిర్వహించుకునే స్థానిక వ్యాపారులు తమ దరకాస్తులు స్థానిక మార్కెట్ కమిటీ సెక్రటరీ, జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి, ఒంగోలు జూనియర్ మార్కెటింగ్ అసిస్టెంట్‌ను సంప్రదించాలి. పూర్తి వివరాల కోసం 91823 61410, 91823 61412, 91823 61262 నంబర్లను సంప్రదించాలని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

దళారుల నుంచి రైతులకు రక్షణ

రైతులు పండించుకున్న పంటలను దళారుల బారిన పడకుండా ఉండేందుకు తామే స్వయంగా వినియోగదారులకు అమ్ముకునేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.1.28 కోట్లు కేటాయించారు. అందరికీ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో అప్పటి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ యర్రగొండపాలెంలోని పుల్లలచెరువు రోడ్డులో ఉన్న ఖరీదైన స్థలంలో రైతు బజార్ నిర్మాణాలు చేపట్టించారు. రైతులు, వినియోగదారులకు సౌకర్యాలు కల్పిస్తూ అన్ని హంగులతో రైతు బజార్ నిర్మాణాలు పూర్తయ్యాయి. 2022 ఆగస్టు 24వ తేదీన ఆదిమూలపు సురేష్ ప్రారంభోత్సవం చేశారు. అప్పట్లో నిర్మాణ శాఖాధికారులు చిన్న చిన్న పనులు త్వరితగతిన పూర్తి చేయలేక పోవడం, ఇతర కారణాలతో రైతు బజార్‌ను రైతులకు కేటాయించలేక పోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 5 నెలల తర్వాత కలెక్టర్ తమీమ్ అన్సారియా యర్రగొండపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించి వినియోగంలో లేని రైతు బజార్‌ను ఆమె సందర్శించారు. రైతులకు సౌలభ్యంగా ఉన్న రైతు బజార్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకు రావాలని మార్కెటింగ్ శాఖాధికారులకు ఆదేశించారు. దీంతో రైతు బజార్‌ను త్వరలో రైతులకు అంకితం చేయనున్నారు.


పుల్లలచెరువు రోడ్డులో నిర్మించిన రైతు బజార్


రైతులు, వినియోగదారుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన స్టాల్స్

మా కుటుంబాలను ఆదుకోండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దుకాణదారులు

యర్రగొండపాలెం: తమ కుటుంబాలను ఆదుకోవాలని స్థానిక ప్రభుత్వ వైద్యశాల ప్రహరీ వద్ద బంకులు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న పలువురు వేడుకున్నారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ బాల కిషోర్‌కు వినతిపత్రం అందచేశారు. 18 ఏళ్లుగా వైద్యశాల పహరీ వద్ద మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్‌లు, చేతివృత్తులు చేసుకునేవారు దాదాపు 60 మంది బంకులు ఏర్పాటు చేసుకున్నారని, వైద్యశాలకు చెందిన అధికారులు బంకులు తొలగించాలని నోటీసులు ఇచ్చారని, దీంతో తమ కుటుంబాలు వీధిన పడాల్సి వస్తుందని వారు ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంపై విచారించి తమకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి జయంతి


పూజలు చేస్తున్న భక్తులు

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో కార్తీక శుద్ధ ద్వాదశి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 416వ జయంతిని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పురోహితులు మణిబాబు శర్మ ఉదయం 6 గంటల నుంచి శ్రీవీర బ్రహ్మ సుప్రభాతం, పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శత నామావళి, సహస్ర నామావళి, కాళికాంబ సప్తశతి, మహా నైవేద్యం, మంత్ర పుష్పం, సామూహిక హారతులిచ్చారు. గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భైరవానంద స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దొండపాడు గ్రామ వాస్తవ్యులు ఇరిగినబోయిన చిన్న పాపారాయుడు భక్తులకు అన్నదానం చేశారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు


రామాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు


పూజలందుకుంటున్న ఉత్సవ విగ్రహాలు

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి సంబంధించి గోపుర కలిశ పునఃస్థాపన కార్యక్రమాన్ని ఆలయ పూజారి అనంతాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రాల మధ్య పునఃస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఆలయ ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ నిర్వహించి ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

పూజా కార్యక్రమాల్లో భక్తులతో పాటు ఆలయ ధర్మకర్త జానకి రఘు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రంథ పాలకుడు డి.వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. 14న పండిట్ జవహరలాల్ నెహ్రూ జన్మదినం, 15వ తేదీన పుస్తక ప్రదర్శన, వ్యాసరచన పోటీలు నిర్వహణ, 16వ తేదీన గ్రంథాలయ ఉద్యమకారులైన రంగనాథన్, పాతూరు నాగభూషన్, అయ్యంకి వెంకట రమణయ్య చేసిన సేవలను వివరించుట, 17వ తేదీన కవి సమ్మేళనం, సెమినార్లు, రచయితల సందేహాలు, పాటల పోటీలు నిర్వహణ, 18వ తేదీన బాలికల ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, 19వ తేదీన ఇందిరా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహణ, 20వ తేదీన ముగింపు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

యర్రగొండపాలెం: బాలల దినోత్సవం సందర్భంగా నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీ బుధవారం తెలిపారు. 14వ తేదీన బాలల దినోత్సవం, నెహ్రూ జయంతి, 5, 6 తరగతులు చదివే విద్యార్థినీ, విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు (ఛార్ట్స్, పెన్సిల్స్, కలర్స్ విద్యార్థులు తెచ్చుకోవాలి), 15న ఉదయం 9 గంటలకు పుస్తక ప్రదర్శన, 10 గంటలకు 7 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు, 16న 7 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఉదయం 9 గంటలకు వ్యాధులు, రకాలు, కారణాలు, నివారణ చర్యలు అనే అంశంపై వ్యాస రచన పోటీలు, గ్రంథాలయ పితామహులకు నివాళి, మధ్యాహ్నం 8 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు కబడ్డీ పోటీలు, 17న కవి సమ్మేళనం, రచయితల సందేశాలు, 7 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు చెస్ పోటీలు (చెస్ బోర్డులు తామే తెచ్చుకోవాలి), 18న క్విజ్ పోటీలు, బాలికలకు వక్తృత్వ పోటీలు, 19న ముగ్గుల పోటీలు (పోటీల్లో పాల్గొనే వారు ఛార్ట్స్‌పై వేయాలి, కలర్స్, ఛార్ట్స్ తామే తెచ్చుకోవాలి), 20న ముగింపు వేడుకలు ఉంటాయని ఆమె తెలిపారు.

కురిచేడు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయం పరిధిలో గురువారం నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకురాలు ఎల్.సుమతి తెలిపారు. వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

త్రిపురాంతకం: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. త్రిపురాంతకం గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకుడు రామాంజి నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన పోస్టర్ ఆవిష్కరణలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఎస్‌ఐ శివ బసవరాజు, ఎంఈఓ కె. తులసిమల్లికార్జున నాయక్, శ్రీశ్రీ కళావేదిక కార్యదర్శి నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ పథకాలు వినియోగించుకోవాలి


లైసెన్స్‌లు అందుకుంటున్న మత్స్యకారులు

తాళ్లూరు: ఆక్వా సాగుదారులకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనలో ఆ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న చేపల వేటకు సంబంధించిన పరికరాలు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ బి.ప్రసాద్‌రావు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రసాద్‌రావు మాట్లాడుతూ రెండు ఫిష్ ఆంధ్ర స్కీమ్‌లు, ఒక మోపెడ్, ఆయా మత్స్యశాఖకు సంబంధించిన 20 కుటుంబాలకు లైసెన్స్‌లు అందించినట్లు పేర్కొన్నారు. పొలం కలిగిన రైతులు వర్షాలు సమయంలో పంట విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు అంజమ్మ, ఫిషనరీ అసిస్టెంట్ వై.ఎలీషా, వీఏఏ నాగరాజునాయక్, డీఏ ఉమామాధవి పాల్గొన్నారు.

రైతులు ప్రత్యామ్నాయ పంటలు పండించాలి


పెద్దారవీడు: ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ బుజ్జిబాయి


త్రిపురాంతకం: సోమేపల్లిలో పంటలను పరిశీలిస్తున్న ఏఓ నీరజ

పెద్దారవీడు: పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు పండించాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి సూచించారు. మండలంలో పుచ్చకాయలపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ పొగాకును పరిమితి విస్తీర్ణంలో సాగు చేసి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలన్నారు. పొగాకు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారని, ఎగుమతులు ఉంటేనే పొగాకు లాభసాటిగా పంట అని అన్నారు. పంటల సరళిలో మార్పు తీసుకురావాలని, ఒకే పంట కాకుండా నాలుగైదు పంటలు వేసుకుంటే గిట్టుబాటు ధర వస్తుందని, నేల స్వభావాన్ని బట్టి పంటలు వేసుకోవాలని సూచించారు. పొగాకు చాలా ప్రమాదకరమైందని, సిగిరెట్ తాగితే ఊపిరితిత్తుల సమస్య, క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. పొగాకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆంక్షలు ఎక్కువగా ఉన్నాయని, భవిష్యత్తులో ఈ పంటకు ముప్పు కలుగుతుందని తెలిపారు. ప్రత్యామ్నాయంగా శనగ, మినుము, బొబ్బర్లు, ఉలవలు, పెసర, చిరుధాన్యాల వంటి పంటలు సాగు చేస్తే లాభసాటిగా ఉన్నాయని, వాటికి మార్కెట్లో మంచి ధర ఉందన్నారు. కార్యక్రమంలో వీఏఏ లాలూనాయక్, రైతులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: వరి, మిరపలో సకాలంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.నీరజ పేర్కొన్నారు. మండలంలోని సోమేపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరి, మిరప పంటలను క్షేత్ర స్థాయిలో ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో జింక్ లోపం ఎక్కువగా ఉందన్నారు. అదే విధంగా ఆకుముడత ఉందని, దోమ అధికంగా ఉన్నందున తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. మిరపలో ఎండుతెగులు ఉందని తెగులు ఉధృతి తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జొన్న, మొక్కజొన్న, శనగ వంటి పంటలు రైతులు వేసినందున తగిన జాగ్రత్తలతో పంటలు పండించాలన్నారు.

దొనకొండ: గ్రామాల్లోని రైతులు సాగు చేసిన పంటలకు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడి అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని యర్రబాలెం, బాదాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు పొలాలకు మోతాదుకు మించి వినియోగిస్తే నేల విష పూరితమై పంటలకు రాబోయే రోజుల్లో ఉపయోగపడే సూక్ష్మ జీవులు నశించి పోతాయన్నారు. ఈ నెల 17 నుంచి ఈ-పంట నమోదు చేయబోతున్నట్లు తెలిపారు. రైతులు మరిన్ని వివరాల కోసం రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు. యర్రబాలెం గ్రామంలో రైతులకు మట్టి నమూనా విశ్లేషణ పత్రాలు అందజేశారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణాధికారి జి.యోగేశ్వరరావు, గ్రామ సహాయకులు విన్నీబాబు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి జవహర్‌లాల్ నాయక్ బుధవారం మండల పరిధిలోని ఐనముక్కల, తిమ్మాపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సాగు చేసిన శనగ, మిరప పంటలను క్షేత్ర స్థాయిల్లో సందర్శించారు. ఈ సందర్భంగా శనగ పంటలో ఎండు తెగుళ్లను గమనించారు. తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు, లేక కారంబేండజేం గ్రామును లీటర్ నీటికి కలిపి మొక్క మొదల్లో పోస్తే తెగులును నివారించుకోవచ్చని వ్యవసాయ అధికారి జవహర్‌లాల్‌నాయక్ తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ మహాసభలు జయప్రదం చేయండి


మాట్లాడుతున్న కరుణానిధి

దర్శి: ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ మహాసభల కరపత్రాలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరుణానిధి మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన పొదిలిలో జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలపై ఉద్యమ కార్యాచరణ జరుగుతుందన్నారు. జాతీయ నాయకులు గుజ్జుల ఈశ్వరయ్య, కేశవరెడ్డి తదితర నాయకులు హాజరవుతారన్నారు. దర్శి నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సురేంద్ర, జి. స్టాలిన్, నాయకులు చంద్రశేఖర్, శ్రీను, జోయల్, చందు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరపురం విద్యార్థుల సత్తా

ముండ్లమూరు (దర్శి): రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని ఉమామహేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ పి.తిరుపతిస్వామి తెలిపారు. చీమకుర్తిలో బుధవారం జరిగిన జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి అండర్-14 విభాగంలో సీహెచ్ మాధవి, ఎన్.ప్రణతి, బి.భావన, బి.షర్మిల, అండర్-14 బాలుర విభాగంలో కమలాకర్, అండర్-17 బాలికల విభాగంలో సీహెచ్ పుష్పా రేణుక, కె.మహేశ్వరి, కె.శ్రావణిలు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ


పొలంలో బాధిత రైతు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని నూజెళ్లపల్లి గ్రామానికి చెందిన రైతులు ఆలా వెంకటస్వామి, మంచా శ్రీనివాసరావు, చుక్కా బ్రహ్మయ్యలకు చెందిన 16కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల చూడగా ట్రాన్స్‌ఫర్మర్ ఊడదీసి అందులో ఉన్న అల్యూమినియం వైరును దొంగిలించుకెళ్లారు. ఇటీవల ముండ్లమూరు మండలంలో 40కి పైగా ట్రాన్స్‌ఫార్మర్‌లు దొంగల పాలు కావడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

పెద్దారవీడు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ మహిళ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని హనుమాన్ జంక్షన్ కుంటలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పోతంపల్లి గ్రామానికి చెందిన నాగేశ్వరరావుకు గిద్దలూరు మండలం అంబవరం గ్రామానికి చెందిన కల్లూరి నాగలక్ష్మి(42)తో వివాహమైంది. ఇద్దరూ కలిసి హనుమాన్ జంక్షన్ కుంటలో నివాసం ఉంటున్నారు. ఆమె భర్త నాగేశ్వరరావు కూలీ పనులు చేసేందుకు తెంగాణ ప్రాంతానికి వెళ్లాడు. ఏం జరిగిందో తెలియదు కానీ నాగలక్ష్మి తాము ఉంటున్న ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.అనిల్‌కుమార్ తెలిపారు. ఆమె మరణానికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ గీతం డిగ్రీ కాలేజీ, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఆథరైజ్డ్ స్టడీ సెంటర్ నందు B.A, BBA, B.Com, M.Sc (All), MSc సైకాలజీ, B.Lisc, MA (All), M.Com, MHRM, MSW కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. ఒంగోలు. సెల్ ✆ 98491 24970 [OA-341]

Wanted

■ ఒంగోలులోని ప్రముఖ విద్యాసంస్థ నందు పనిచేయుటకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ JLs మరియు సెక్షన్ ఇన్‌చార్జ్‌లు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ ✆ 85003 01111, 87121 64111. [OA-339]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253915]

■ Secur Security Services టంగుటూరు పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సెక్యూరిటీ ASO లు మరియు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఫ్రీ రూమ్ & మీల్స్ సదుపాయం కలదు. 99595 98279. [NA-23860]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073 [SCA24000627]

■ మర్చంట్ నేవీలో Cruise Shipsలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు, విభాగం అన్ని డిపార్టుమెంట్స్ వ: 18-27, Qly: 10th & అబోవ్, లాయిడ్స్ మ్యారిన్ సర్వీసెస్ Pvt. Ltd, Hyd, T.G., కోయంబత్తూర్ (TN) Ph: 7675982065 [SCA24000632]

■ HPCL Pipeline (కోదాడ నుండి భువనగిరి వరకు) DGR Minimum Wages (C City) ద్వారా సెక్యూరిటీ గార్డుగా పనిచేయుటకు మాజీ సైనికులు (Ex-Serviceman) కావలెను. ఆసక్తి గలవారు సంప్ర : M O Pillai Security Agency. Ph : 7702599908 [HA-14762]

■ We are Hiring experienced Architecture at Ongole. Contact No. ✆ 77999 93718. [OA-337]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలకు సంప్రదించండి :
క్లాసిఫైడ్స్ :
ఒంగోలు
90102 02762





